జోన్-8లో అక్రమ నిర్మాణాల జోరు

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ జోన్ 8లో అక్రమ నిర్మాణాల జోరు సాగుతున్నా అధికారులకు ఏమి పట్టనట్టు వ్యవహరించటంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ జోన్-8 పరిధి బాజీ జంక్షన్‌లో, గోపాలపట్నం, కొత్తపాలెం, సింహాచలం సాయినగర్, సింహాచలం రైల్వే లైన్ల మధ్య బహుళ అంతస్తులు, మొదలగు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతు న్నాయి. జోన్ 8లో అడుగడునా అక్రమ భారీ భవంతులు వెలుస్తున్నాయి. 1, 2, 3 ఫ్లోర్లకు మాత్రమే అనుమతులు తీసుకుని అంతకు మించి భారీ నిర్మాణాలు చేపడుతున్నారు. ఏదో వచ్చారు కొద్దిగా కన్నం కొట్టి వెళ్లారు అంటూ అధికారులు, సిబ్బంది తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనంతటికి బదిలీపై వెళ్లిన అధికారి చేసిన తప్పులని అధికారులు చెప్పుకొస్తున్నారు. కొత్తగా వచ్చిన అధికారి అక్రమ నిర్మాణం వైపు చూడకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు బిల్డర్లతో టౌన్ ప్లానింగ్ అధికారులు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ నిర్మాణాల వల్ల జీవీఎంసీ ఆదాయానికి గండి పదు తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాధనం బుగ్గిపాలు...

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ 98వ వార్డ్ పాత అడవివరం నుండి పాత గోశాల వరకు బీఆర్టీఎస్ రోడ్ నిర్మాణం ప్లాన్ మారిందని జి.వి.ఎం.సి ఈఈ సుబ్బారావు తెలిపారు. ఇప్పటికే 80% రోడ్డు యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం జరిగిందని, అయితే స్థానిక నేతలు, ప్రజలు బీఆర్టీఎస్ రోడ్ మ్యాప్‌లను మార్పు చేసి కేవలం మూడు రోడ్డుల నిర్మాణం మాత్రమే నిర్మించమని కోరటం జరిగిందని అన్నారు. అందువలన సుమారు 600 మీటర్లను ఇప్పటికే నిర్మించిన రోడ్ డివైడర్‌ను తొలగించటం జరిగిందని అన్నారు. ఏది ఏమైనప్పటికీ కొంతమంది అనాలోచిత నిర్ణయాల వలన ప్రజా ధనం బుగ్గి పాలవుతుంది. రోడ్ మ్యాప్‌ను అధికారులు, స్థానిక ప్రజా నేతలు, ప్రజలు పరిశీలించిన తరువాతే రోడ్ నిర్మాణం ప్రారం భించారు. దాదాపు పూర్తి కావచ్చిన రోడ్ ఇప్పుడు ఎవరికీ నచ్చినట్లు వారు ప్లాన్ మార్చి వేయటం వలన వివిధ టాక్స్‌ల రూపంలో చెల్లించిన ప్రజా ధనం బుగ్గి పాలు కాక మరేమనాలి అని కొంతమంది వాహన చోదకులు, ప్రజలు, భక్తులు అంటున్నారు. అదికాక రోడ్డు పూర్తిగా నిర్మాణం అయిన తరువాత విద్యుత్ అని, అండర్ గ్రౌండ్ కేబుల్, డ్రైనేజి, పైపులైన్ ఇలా రకరకాలుగా ఎక్కడ పడితే అక్కడ ఎవరికి నచ్చినట్లు రోడ్డు తవ్వి ప్రమాదాలకు నిలయాలుగా తయారు చేస్తారని, రోడ్డు నిర్మాణ సమయంలో పైన తెలిపిన వన్నీ ఏర్పాటు చేసుకోవచ్చు కదా అని, అలా చేస్తే కాంట్రాక్టర్, కమిషన్‌లు రావని కొందమంది వాహన చోదకులు అంటూ ప్రజలు మండిపడుతున్నారు.

గిరిప్రదక్షిణ ఏర్పాట్ల పరిశీలన

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవ్యం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామివారి గిరి ప్రదక్షిణ ఏర్పాట్లను కలెక్టర్ హరీంద్ర ప్రసాద్ బృందం, జిల్లా అధికార యంత్రాంగం, కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసమూర్తి శనివారం పరిశీలించారు. ఈనెల 20న గిరి ప్రదక్షిణ, 21న ఆషాడ పౌర్ణమి సందర్భంగా ఆఖరి విడత చందన సమర్పణ రోజు భక్తుల తాకిడి అధికంగా ఉండవచ్చు అనే ఆలోచనతో ముందస్తుగా జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పరిశీలిస్తూ దేవస్థానం వారికి సలహా సూచనలు చేస్తున్నారు. గిరి ప్రదర్శన సాగే అన్ని రోడ్ల మరమ్మతులతోపాటు పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ సింహాచలం తొలి పావంచా నుంచి హనుమంత వాక, బీచ్ రోడ్డు, సీతమ్మధార, కైలాసపురం, మాధవధార, గోపాలపట్నం తదితర ప్రాంతాలలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈనెల 20, 21వ తేదీల్లో మద్యంషాపులు మూసివేయాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు.

కేజీహెచ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ కేజీహెచ్‌లో తనిఖీలు నిర్వహించారు. పలు వార్డుల పరిశీలించి అక్కడ పరిస్థితులపై ఆరా తీశారు. ఎం.ఆర్.ఐ. స్కానింగ్ సెంటర్ తనిఖీ, అక్కడ అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. కె.జి.హెచ్. పర్యటనలో భాగంగా అక్కడ పరిస్థితులపై, సమస్యలపై విభాగాధిపతులతో తొలి సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలపై సమీక్ష చేసి సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. కలిసి పని చేద్దామని, ప్రజలకు మంచి సేవలందిద్దాం అని పిలుపునిచ్చారు. సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కె.జి.హెచ్.లో ఇప్పటి వరకు జరిగిన పరిణా మాలను, సంఘటనలను తెలుసుకున్నారు. సమావేశంలో భాగస్వామ్యమైన కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. కె.శివానంద, ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, అన్ని విభాగాల హెచ్.ఓ.డి.లు, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితులు అరెస్ట్

- చోరీ సొత్తు రికవరీ: క్రైమ్ డీసీపీ వెంకట రత్నం

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో ఒక చోరీ కేసు చేదించామని డీసీపీ (క్రైమ్) పి.వెంకట రత్నం తెలిపారు. ఆమె శనివారం నగర పోలీసు కార్యాలయం వద్ద జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అంతరాష్ట్ర నిందితుడు గెద్దెల శ్రీనివాస రెడ్డి (53) విశాలాక్షి నగర్ సహా కొన్ని ప్రాంతాల్లో చోరీలు చేశాడు అని తెలిపారు. ఇతను 2022లో ఒక బైకు చోరీ చేశారని, కొన్ని కేసుల్లో 13 నెలలు జైలు శిక్ష అనుభవించాడన్నారు. ఇతను గతంలో గాజువాక దరి మిందిలో నివాసం వుండే వాడని, అప్పుడు నాలుగు కేసుల్లో శిక్ష పడిందన్నారు. ఇతను 2023లో జైలు నుంచి విడుదల అయ్యాడని, ఇతను తెలంగాణ రాష్ట్రం యాదాద్రి జిల్లా భువన గిరిలో నివాసం వుంటున్నాడని, జైలులో సాయితో స్నేహం చేసి నేరాలు చేస్తున్నాడని, ప్రహ్లాదపురంలో ఒక ప్రొఫెసర్ తీర్థ యాత్రలు వెళ్లి వచ్చాక ఇంట్లో దోపిడీ జరిగిందని ఫిర్యాదు అందిందన్నారు. 403 గ్రాముల బంగారం, 2620 గ్రాముల వెండి చోరీ జరిగిందని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నిందితులు నుంచి 235 గ్రాముల బంగారం, 1935 గ్రాముల వెండి బైకు రికవరీ చేశామన్నారు. నిందితుని సొంత ఊరు గుంటూరు అని, హైదరాబాద్ వెళ్లి క్లీనర్ వంటి ఉద్యోగాలు చేసే వాడని, ఇతనిపై మొత్తం 17 కేసులు గతంలో వున్నాయన్నారు. గెద్దెల శ్రీనివాస రెడ్డి (53)కి జైలులో సాయి కుమార్‌తో పరిచయం ఏర్పడిందని, ఇద్దరు కలిసి నేరాలు చేశారని, మిందిలో ఇతనికి దేవితో పరిచయం ఏర్పడిందని, కొంత సొత్తును దేవి వద్ద రికవరీ చేశాం అన్నారు. కాగా, పెందుర్తిలో మొత్తం నలుగురిని అరెస్ట్ చేశామన్నారు. మీడియా సమావేశంలో వెస్ట్ ఎసిపి (క్రైమ్) సీహెచ్.శ్యామలరావు, వెస్ట్ క్రైమ్ సీఐ ఎన్.శ్రీనివాసరావు, పెందుర్తి క్రైమ్ ఎస్ఐ రుక్మాంధరావు, హెచ్‌సి నాగ రాజు, పీసీ జి.శివ కృష్ణ, పీసీ పైడి రాజు పాల్గొన్నారు.

విశాఖ ఫిషింగ్ హార్బర్‌ను

పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో 170 కోట్ల రూపాయల కేంద్ర ప్రభుత్వ నిధులతో విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను నూతన విశాఖ జిల్లా కలెక్టర్ హరేందర్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా మోడ్రన్ ఫిష్ మార్కెట్‌లో మంచినీటి సదుపాయం 11వ నెంబర్ జెట్టి వరకు త్రాగునీటి వసతి కల్పించాలని విశాఖ పోర్టు, జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ఫిషింగ్ హార్బర్‌లోనే మరమ్మతులు చేసుకోవడానికి సరైన సదుపాయం లేదని డ్రై డాక్‌లో ఉన్నటువంటి ట్రాలీలను రిపేర్ చేయించాలని, హార్బర్లో ప్రమాదాలు, అవసరాలకు అనుగుణంగా క్రేన్ సదుపాయం కల్పించాలని జిల్లా కలెక్టర్ దృష్టికి అసోసియేషన్ అధ్యక్షుడు జానకిరామ్ తీసుకొని వెళ్లారు. ట్రాఫిక్ సమస్య హార్బర్‌లో అధికంగా ఉందని ట్రాఫిక్ పోలీసులు సహకారంతో ఆటోలను ఫిషింగ్ హార్బర్లోకి రాకుండా నిరోధించాలని, అనవసరంగా పేరుకుపోయినటువంటి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, మత్స్య వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జీవీఎంసీ అధికారులను వేస్ట్ మేనేజ్మెంట్ ఫెసిలిటీ కొరకు అవసరమైన డస్ట్ బిన్లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వ్యర్థాలు హార్బర్‌లో లేకుండా చూడాలని జీవీఎంసీ అధికారులను కలెక్టర్ ఆదేశిం చారు. ఫిషింగ్ హార్బర్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను విశాఖ పోర్ట్ అథారిటీ చీఫ్ ఇంజనీర్ వికాస్ జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ జేడీ విజయకృష్ణ, జీవీఎంసీ వాటర్ సప్లై రవి, విశాఖ పోర్టు అథారిటీ ఈఈ అరుణ్ కుమార్, జే.ఇ. విశ్వనాథ్. వాటర్ సప్లై ఇఇ శేఖర్, ఎఫ్‌డీఓ ఆశాజ్యోతి, డాల్ఫిన్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి వీర్రాజు, కార్యదర్శి వలిశెట్టి చిన్న, సూరాడ సత్తిబాబు, గుంటు దానయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ కమిటీ సభ్యునికి అభినందన

విశాలాంధ్ర - పెదగంట్యాడ: వీఎస్పీ ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ కమిటీ సభ్యునిగా నియమితులైన స్టీల్‌ప్లాంట్ ఎంఎంఎంఎస్ విభాగం డిజిఎం మనోజ్ ఓరాన్‌ను ఎంఎంఎస్ఎం విభాగం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం శనివారం ఘనంగా సత్కరించింది. ఐ.ఉమా మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ అభినందన కార్యక్రమానికి డి.జి.ఎం (ఎలక్ట్రికల్) ఏ.ఎం.తివారీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మనోజ్ ఓరాన్ స్టీల్ ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ సెల్ కమిటీ సభ్యునిగా నియమితులు కావడం అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమం నిర్వాహకులు ఐ.చిట్టి బాబు, అధికారులు ఎం.చంద్ర శేఖర్, బి.గణేష్, ఎండి బోయర్, ఏ.వి.సత్యనారాయణ, డి.శ్రీనివాస్, విద్యుత్ కుమార్ వర్మ, టి.వేణు, జి.ఆనంద్, ఎన్.నర్సింగరావు, మహిళా ఉద్యోగిని టి.రవళి, విఎస్‌పి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.తవుడన్న, బయ్యే మల్లయ్య, నాయకులు డి.పుల్లారావు, రత్నం, బానోత్ కృష్ణ పాల్గొన్నారు.

ఎస్సీల అసైన్డ్ భూములు ఎస్సీలకే అమ్మాలి

ప్రభుత్వానికి విదసం సూచన

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జీవో నెంబర్ 596 ప్రకారం ఫ్రి హోల్డ్ చేసిన అసైన్డ్ భూముల కొనుగోలులో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయాలంటే అసైన్డ్ భూముల క్రయ విక్రయాలు ఎస్సీల నుండి ఎస్సీలకు, బీసీల నుండి బీసీలకు మధ్యనే జరిగేలా షరతులతో జీవోలో సవరణ చేయాలని విదసం ఐక్య వేదిక రాష్ట్ర సమితి సమన్వయకర్త డాక్టర్ బూసి వెంకటరావు ప్రభుత్వానికి సూచించారు. అసైన్డ్ భూముల కొనుగోలులో ఇన్సైడ్ ట్రేడింగ్ జరిగిన నేపథ్యంలో అంబేద్కర్ భవన్ వద్ద జరిగిన విదసం సమావేశంలో ఆయన మాట్లాడారు. 35/2023 అసైన్డ్ చట్ట సవరణ నేపథ్యంలో జీఓ రాక ముందే మాజీ సీఎస్ జవహర్ రెడ్డి, వైసీపీ నాయకులు అసైన్డ్ రైతులను మభ్యపెట్టి ముందస్తు ఒప్పందాలతో బినామీలు, దళారీలు ద్వారా వందల ఎకరాల అసైన్డ్ భూములు అక్రమంగా కొనుగోలు చేసి ఇన్సైడ్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారని ఇది అధికార రహస్య చట్ట ఉల్లంఘన కింద నేరం అన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో మొత్తం 34,000 ఎకరాల అసైన్డ్ భూములు రిజిస్టరు కాగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో 2 వేల ఎకరాల భూములు రిజిస్ట్రేషన్ జరిగాయని, జీఓ వచ్చిన నెల రోజుల వ్యవధిలో వేలాది ఎకరాలు రిజిస్ట్రేషన్ల జరగడం, అసైన్డ్‌దారుల నిజ జాబితాపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిజమైన హక్కుదారుల వివరాలు వెబ్ ల్యాండ్‌లో నమోదు కాకుండా కలెక్టరు ఆదేశాలతో దొంగ రిజిస్ట్రేషన్లు చేసి వైసీపీ నేతలు భారీ కుంభకోణం చేశారన్నారు. ఈ మోసాలు అరికట్టాలంటే అసైన్డ్ భూములు అమ్మ కాలు కొనుగోళ్లపై షరతులు విధించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల భూములు ఆదివాసీలకే అమ్మాలనే షరతు ఉన్నట్లే దళితుల అసైన్డ్ భూములు దళితులే తప్ప ఇతరులు కొనుగోలు చేయడానికి అవకాశం లేకుండా జీఓలో సవరణ తేవాలన్నారు. అలాగే బీసీల పేరుతో ఫ్రీ హోల్డ్ అయిన భూములు బీసీలకు మాత్రమే రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించారన్నారు. ఇంకా మెరుగైన పద్ధతిలో జీఓ సవరణ కోసం విదసం విస్తృత స్థాయిలో రిటైర్డు ఐఏఎస్ అధికారుల సమక్షంలో అసైన్డ్ రైతులతోను, దళిత సంఘాల పెద్దలతోను చర్చించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేస్తామని తెలపారు. ఈ కార్యక్రమంలో సోదాదాసి సుధాకర్, ఈతలపాక సుజాత, జాజి ఓంకార్, బల్ల కుమార్, బూల భాస్కరరావు, గుడివాడ ప్రసాద్, డి.నిర్మల, రవి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

19 మందికి పోలీసులకు

పదోన్నతులు కల్పించిన సీపీ

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖలో మొట్టమొదటి సారిగా సిబ్బంది సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం ఇస్తూ నగర పోలీసు కమిషనర్ డా.శంఖబ్రాత బాగ్చి కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతూ నగర పోలీసు కమిషనరేట్‌కు చెందిన పదోన్నతి పొందిన 19 మంది సిబ్బందికి సత్కరించి, పదోన్నతి ర్యాంకులతో పాటుగా పోస్టింగ్ ఆర్డర్ శనివారం అందజేశారు. నగర పోలీసు కమిషనరేట్‌కు చెందిన 7 మంది సివిల్ హెడ్ కానిస్టేబుళ్ళు, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లుగా పదోన్నతి పొందారు. 10 మంది సివిల్ కానిస్టేబుళ్ళు, హెడ్ కానిస్టే బుళ్ళుగా, 2 ఆర్మడ్ రిజర్వ్ కానిస్టేబుళ్ళు, ఆర్మడ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుళ్ళుగా పదోన్నతి పొందడం జరిగిందని సిపి తెలిపారు. సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక ప్రాధాన్యం ఎల్లప్పుడూ ఇచ్చే సీపీ పోలీసు శాఖ నందు పదోన్నతి పొందిన సదరు 17 మంది సిబ్బందిని వారి కుటుంబ సభ్యులతో పాటుగా నగర పోలీసు సమావేశ మందిరం (టెంపుల్ ఆఫ్ లెర్నింగ్)కు ఆహ్వానించారు. అనంతరం పదోన్నతి పొందిన సిబ్బంది మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఏర్పాటు పట్ల సభాముఖంగా తమ హర్షం తెలియజేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీసు శాఖలో సిబ్బంది అందరూ ఎండలో, వానలో, తుఫానులలో, నక్సలైట్ కూంబింగ్‌లో, అనేక విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవ చేయడానికి, లా అండ్ ఆర్డర్ సంరక్షణ కొరకు, నేరాలు కనిపెట్ట దానికి ప్రాణాలు లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తార న్నారు. నేను ఒక సీనియర్ ఐ.పి.ఎస్ అధికారిగా ఇటువంటి చాలా అనుభవాలు చూసానన్నారు. పోలీసు శాఖలో సిబ్బందికి తమ సర్వీస్‌లో ఒకటి, లేదా రెండు పదోన్నతలు వస్తాయని కొందరికి అవి కూడా రావని అందుకే ప్రభుత్వం ఇన్‌క్రిమెంట్ల రూపంలో మరో వెసులుబాటు కల్పించిందన్నారు. కాబట్టి సిబ్బందికి వచ్చే ఈ పదోన్నతిని సిబ్బంది సర్వీస్ అంతటా గుర్తుంచుకొనేలా చేయాలనే ఉద్దేశంతో ఈ వినూత్న కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ కే.ఫక్కీరప్ప, డీసీపీ-02, డీసీపీ(క్రైమ్స్), నగర పోలీసు ఉన్నతాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తితో జిల్లా కలెక్టర్ మర్యాద పూర్వక భేటీ



విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావుతో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. శనివారం ఉదయం విశాఖపట్నంలోని సర్క్యూట్ హౌస్‌కు చేరుకున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, పోలీస్ కమిషనర్ ఎస్.బాగ్చిలతో పాటు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. వివిధ అంశాలపై కాసేపు మాట్లాడారు.

విపత్తులపై అవగాహన

విశాలాంధ్ర - ఆనందపురం: ప్రమాదాలను ఏ విధంగా అరికట్టాలి, ప్రమాదాలు సంభవించేటప్పుడు ఎలా బయటపడాలి అన్న దానిపై ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. శనివారం ఆనంద పురం మండలం వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం వైజాగ్ ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్లైవుడ్ కంపెనీ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలు, తుఫానులు, వరదలు వచ్చినప్పుడు వాటి నుండి ఏవిధంగా రక్షణ పొందాలో కార్మికులకు, ప్రజలకు అవేర్నెస్ కార్యక్రమం చేపట్టి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ హేమంత్ కుమార్, ఆర్ఐ మణికంఠ, వైజాగ్ ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్టాఫ్ చంద్రశేఖర్ సత్యం, ఏఎస్ఓ శ్రీనివాసరావు, వీఆర్వో అప్పల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీసీపీ-1గా అజిత వేజెండ్ల: డీసీపీ-2గా తుహిన్ సిన్హా

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్రంలో భారీగా 37 మంది ఐపీఎస్ అధికారులకు శనివారం బదిలీలు జరిగాయి. పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న అజిత వేజెండ్లను విశాఖ డీసీపీ 1గా, అల్లూరి జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న తుహిన్ సిన్హాను విశాఖ డీసీపీ 2గా ప్రభుత్వం నియమించింది. అజిత గతంలో డీసీపీగా విశాఖ కమిషనరేట్‌లో పనిచేశారు. తుహిన్ సిన్హా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీగా ప్రస్తుతం పని చేస్తున్నారు.

ఇచ్ఛాపురంలో వైద్య శిబిరం

విశాలాంధ్ర - ఆనందపురం: వర్షాకాలంలో దోమల వ్యాప్తి లేకుండా అందరూ కృషి చేయాలని ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సామాజిక ఆరోగ్య అధికారి వి.సాంబమూర్తి కోరారు. మండలంలోని ఇచ్ఛాపురం గ్రామంలో ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ఎక్కువగా వచ్చే మలేరియా వ్యాధి రాకుండా వుండాలంటే దోమల వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. ఇంటిలోని నీటి నిల్వలు ఎక్కువ రోజులు ఉంచితే వాటిలో దోమలు గుడ్లు పెడతాయని, తద్వారా దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. లార్వా దశలోనే దోమల వ్యాప్తిని అరికట్టాలని, దానికోసం వారానికి ఒకసారి పూర్తిగా నీటి నిల్వలు తీసివేసి కొత్త నీటిని నింపాలని కోరారు. అలాగే తాగి పడవేసిన కొబ్బరి బోండాలు, టీ కప్పులలో వర్షం నీరు చేరి దోమల వ్యాప్తి జరుగుతుందని, దీనిని కూడా అరికట్టాలని చెప్పారు. వైద్య శిబిరంలో 30 మందికి చికిత్స అందించారు. అనుమానం వున్న రోగులకు మలేరియా రక్త పరీక్షలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణ మోహన్ పార్వతమ్మ, ఆరోగ్య సేవకులు తారకేశ్, ఎంఎల్‌హెచ్‌పీ స్వర్ణలత, ఏఎన్ఎం మెట్ట దేవి, ఆశ కార్యకర్త దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు నేలమట్టం

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో గంభీరం పంచాయతీ పరిధిలో ఉన్న గువ్వల వారి కల్లాలు సర్వేనెంబర్ 145లో అక్రమ కట్టడాలును శనివారం రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. ఇటీవల విశాలాంధ్ర పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన మండల తహశీల్దార్ హేమంత్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలను వీఆర్వో, వీఆర్ఏ ఆధ్వర్యంలో నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ అక్రమ కట్టడాలకు ఎవరైనా పాల్పడినట్లయితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

18 నుంచి జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర - పద్మనాభం: ఈనెల 18 నుంచి జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు భీమిలి నియోజకవర్గం మండల జనసేన పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ ఆల్తి రాజు తెలిపారు. 2024 సంవత్సరానికిగాను జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడతామన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, వార్డు అధ్యక్షులు, జనసైనికులు, వీర మహిళలు అందరూ కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వ నమోదు చేయాలని పిలుపునిచ్చారు.

సాంసంగ్ జెడ్ ఫోల్డ్ 6, జెడ్ ఫ్లిప్ 6కి బుకింగ్‌లు ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన శాంసంగ్, గెలాక్సీ ఏఐ యొక్క తదుపరి అధ్యాయాన్ని ఆవిష్కరిస్తూ, భారతదేశంలో తమ ఆరవ తరం ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌లు - గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, జెడ్ ఫ్లిప్ 6ల కోసం ముందస్తు బుకింగ్ లను తెరిచింది. కొత్త గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, జెడ్ ఫ్లిప్6లు గెలాక్సీ ఏఐ ని నూతన శిఖరాలకు తీసుకువెళ్లనున్నాయి. వినియోగదారులకు ప్రత్యేకమైన మొబైల్ అనుభవాల శ్రేణిని అందిస్తాయి. "శాంసంగ్ వద్ద మా ఆరవ తరం ఫోల్డబుల్స్- గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6 మరియు జెడ్ ఫ్లిప్6తో గెలాక్సీ ఏఐ యొక్క తదుపరి అధ్యాయాన్ని తెరవడానికి మేము సంతోషిస్తున్నాము. ఈ కొత్త స్మార్ట్‌ఫోన్‌లు కమ్యూనికేషన్‌లు, ఉత్పాదకత మరియు సృజనాత్మకత అంతటా ప్రత్యేకమైన మొబైల్ అనుభవాలను ఆవిష్కరించడానికి రూపొందించ బడ్డాయి.

ఏఐతో కనెక్ట్ చేయబడిన గెలాక్సీ పర్యావరణ వ్యవస్థతో కూడిన మా కొత్త ఉత్పత్తులు మిమ్మల్ని శక్తివంతం చేస్తాయి మరియు మీ జీవితాలను మెరుగుపరుస్తాయి, గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6 మరియు జెడ్ ఫ్లిప్6 రెండూ మా నోయిడా ఫ్యాక్టరీలో తయారవుతున్నాయని వెల్లడించేందుకు నేను సంతోషిస్తున్నాను" అని శాంసంగ్ సౌత్‌వెస్ట్ ఆసియా ప్రెసిడెంట్ జె బి పార్క్ అన్నారు.

వెల్లంకి పంచాయతీలో డొక్కా సీతమ్మ మహా అన్నదానం

విశాలాంధ్ర - ఆనందపురం: జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిఠాపురంలో ఘనవిజయం సాధించిన సందర్భంగా మండలంలో వెల్లంకి గ్రామపంచాయతీలో గొలగాని గోవింద (బాలు) ఆధ్వర్యంలో జన సైనికులు ఆర్థిక సహాయంతో సుమారుగా 3000 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ భీమిలి ఇన్చార్జ్ డాక్టర్ సందీప్ పంచకర్ల పాల్గొని మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు డొక్కా సీతమ్మ పేరున పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. డొక్కా సీతమ్మ ఆకలితో వెళ్లిన వారికి అన్నదానం చేసి అన్నపూర్ణగా పేరు గడించారన్నారు. పార్టీ అధినాయకుడు చెప్పిన వెంటనే వెల్లంకి జనసేన పార్టీ నాయకులు గొలగానీ. బాలు ముందుకొచ్చి అన్నదాన కార్యక్రమం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ రామానాయుడు, మండల అధ్యక్షులు అప్పలరాజు, పంచాయతీ నాయకులు సర్దార్ రెడ్డి, సాయి అభిరా, ఉప్పాడ కళ్యాణ్, గంగరాజు, తోనంగి రమణ, శేఖర్, మాదాబత్తుల శ్రీను, బి.కృష్ణ, సర్దార్ సురేష్, కేశవ, నవీన్, జగదీష్, లోకేష్, బంగారి, మురళి జన సైనికులు పాల్గొన్నారు.

ఏసర్ బ్రాండ్ కింద ఇండికల్ టెక్నాలజీ స్మార్ట్ ఫోన్‌లు

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంలోని ప్రముఖ సాంకేతిక సంస్థ ఇండ్‌కల్ టెక్నాలజీస్, వినూత్న సాంకేతికత అసాధారణమైన ఉత్పత్తులకు ప్రసిద్ధి చెందిన గ్లోబల్ ఐసీటీ దిగ్గజం ఏసర్ ఇన్‌కార్పొరేటెడ్‌తో ట్రేడ్‌మార్క్ లైసెన్సింగ్ ఒప్పందం కింద స్మార్ట్‌ఫోన్ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఒప్పందం ప్రకారం, ఇండికల్ భారతదేశంలో ఎసర్ బ్రాండ్ క్రింద స్మార్ట్‌ఫోన్‌ల రూపకల్పన, తయారీ పంపిణీ చేస్తుంది. ఈ వ్యూహాత్మక ఒప్పందం భారతీయ మార్కెట్లోకి ఏసర్-బ్రాండెడ్ స్మార్ట్‌ఫోన్‌ల పరిచయాన్ని సూచిస్తుంది, ఇది ఆవిష్కరణ మరియు విస్తరణ యొక్క కొత్త శకానికి నాంది పలికింది. ఇండికల్ టెక్నాలజీస్ 2024 మధ్యలో ఏ సర్ బ్రాండ్ క్రింద విస్తృత శ్రేణి స్మార్ట్‌ఫోన్ మోడళ్లను లాంచ్ చేస్తుంది, ఇది త్వరగా బలమైన ఊపందుకుంటుంది. గణనీయమైన మార్కెట్ వాటాను పొందుతుందని ఆశిస్తోంది. ఈ ప్రయత్నం ఏ సర్ యొక్క బ్రాండ్ బలం, భారతీయ వినియోగ దారులకు ప్రీమియం - నాణ్యత ఉత్పత్తులను అందించడంలో ఇండ్కాల్ యొక్క నిబద్ధతను హైలైట్ చేస్తుంది. ఇందులో బలమైన స్పెసిఫికేషన్‌లు, అత్యాధునిక హార్డ్‌వేర్ అధునాతన సాఫ్ట్‌వేర్ సాంకేతికతలు ఉన్నాయి.

ఆంధ్ర ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) క్వాలిఫయర్-2లో వైజాగ్ వారియర్స్ చేతిలో ఓడిన రాయలసీమ కింగ్స్

విశాలాంధ్ర - విశాఖపట్నం : ఏపీఎల్ క్వాలిఫయర్-2లో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్ 7 పరుగుల తేడాతో వైజాగ్ వారియర్స్ చేతిలో ఓటమిపాలైంది. వర్షం అంతరాయం మధ్య వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో ఓటమి ద్వారా ఏపీఎల్ నుంచి రాయలసీమ కింగ్స్ నిష్క్రమించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన వైజాగ్ వారియర్స్‌కు ఆదిలోనే మునీశ్‌వర్మ(12) రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. మొదటి నాలుగు ఓవర్లలోనే కీలక వికెట్లు చేజార్చుకుంది. అయితే కేఎస్ భరత్, అశ్విన్ హెబ్బర్ కలిసి 49 బంతుల్లో 83 పరుగులల భాగస్వామ్యం నెలకొల్పారు. వీరిద్దరు కలిసి కింగ్స్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ పరుగులు సాధించారు. ఆఖర్లో ముప్పల యువన్ రాణించడంతో వారియర్స్‌కు పోరాడే స్కోరు(191) దక్కింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన రాయలసీమ కింగ్స్‌కు మూడో ఓవర్‌లో ఓపెనర్ తన్నీరు వంశీకృష్ణ(7) ఔట్ కావడంతో వికెట్ల పతనానికి నాంది పడింది. కెప్టెన్ అశ్విన్ హెబ్బర్ బౌలర్లను మార్చిమార్చి ప్రయోగించడంతో కింగ్స్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. ఓవైపు సాధించాల్సిన రన్‌రేట్ అంతకంతకు పెరుగడం మిడిలార్డర్‌లో పరుగుల రాక మందగించింది.

కెప్టెన్ గిరినాథ్‌రెడ్డి, గుత్తా రోహిత్ కలిసి ఐదో వికెట్‌కు 36 బంతుల్లో 59 పరుగులు జతచేసి పోటీలోకి వచ్చే ప్రయత్నం చేశారు.అయితే కొడవండ్ల సుదర్శన్ ఈ జోడీని విడదీయడం ద్వారా వారియర్స్ పైచేయి సాధించింది. ఆఖర్లో షేక్ కమ్రుద్దీన్ 7 బంతుల్లో 22 పరుగులతో ఒంటరిపోరాటం చేసినా కింగ్స్‌కు లాభం లేకపోయింది.

సీఎంఎఫ్ ఫోన్ ఇతర ఉత్పత్తులు అమ్మకాలు ప్రారంభించిన నథింగ్

విశాలాంధ్ర - విశాఖపట్నం: లండన్‌కు చెందిన టెక్నాలజీ కంపెనీ నథింగ్ యొక్క ఉప-బ్రాండ్ సీఎంఎఫ్, మూడు కొత్త ఉత్పత్తులు-సీఎంఎఫ్ ఫోన్ 1, సీఎంఎఫ్ వాచ్ ప్రో 2 మరియు సీఎంఎఫ్ బడ్స్ ప్రో 2ల అమ్మకాలు ప్రారంభించినట్లు ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. సీఎంఎఫ్ ఫోన్ 1 భారతదేశపు మొదటి మీడియా టెక్ డైమెన్సిటీ 7300 5జీ ప్రాసెసర్‌తో, వేగవంతమైన, నమ్మకమైన మరియు సమర్థవంతమైన శక్తి కోసం శ్రేణిలో గొప్ప సామర్థ్యాన్ని అందిస్తోంది. 5000 ఎంఏహెచ్ బ్యాటరీతో, యూజర్స్ సింగిల్ ఛార్జీపై రెండు రోజుల వరకు ఆనందించవచ్చు. 16 జీబి రామ్ వరకు, ఇది సాఫీ బహుళ పనులను నిర్ధారిస్తుంది మరియు నథింగ్ వారి ఓఎస్ 2.6 పై పని చేస్తుంది. విలక్షణమైన కస్టమైజబుల్ ఆండ్రాయిడ్ అనుభవం అందిస్తుంది. శక్తివంతమైన కెమేరా వ్యవస్థలో ఖచ్చితమైన బొకెహ్ ప్రభావాలు కోసం ప్రత్యేకమైన పోర్ట్ రైట్ సెన్సర్ సోనీ 50 ఎంపీ రియర్ కెమేరా మరియు 16 ఎంపీ ఫ్రంట్ కెమేరా ఉంది.

మెరిసే 6.67" సూపర్ ఆమో ఎల్ఈడి డిస్ ప్లే నిరంతరంగా ఇంటరాక్షన్స్ కోసం అత్యంత-సాఫీ 120 హెచ్ జెడ్ అడాప్టివ్ రిఫ్రెష్ రేట్ ప్రదర్శిస్తుంది. సీఎంఎఫ్ వాచ్ ప్రో 2 మార్చుదగిన బీజెల్ డిజైన్ తో విలక్షణమైన స్టైలిష్ స్మార్ట్ వాచ్ 1.32" ఆమో ఎల్ఈడి తో వస్తుంది. సీఎంఎఫ్ బడ్స్ ప్రో 2 సీఎంఎఫ్ బడ్స్ ప్రో 2 డ్యూయల్ డ్రైవర్స్ ఎల్ డాక్ టెక్నాలజీ, హై రేస్ ఆడియో వైర్ లెస్ ధృవీకరణ, 50 డిబి స్మార్ట్ ఏఎన్ సీ, కస్టమైజబుల్ స్మార్ట్ డయల్‌తో మెరుగైన ఆడియో అనుభవం కోసం డిజైన్ చేయబడింది.

వైస్ అడ్మిరల్ రాజేష్‌ను కలిసిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: తూర్పు నౌకాదళ కమాండ్ ఎఫ్ఓసీ వైస్ అడ్మిరల్ రాజేష్‌ను కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కలిశారు. పరస్పర ప్రయోజనం కోసం ఇండియన్ నేవీ విశాఖపట్నం జిల్లాల మధ్య సమన్వయాన్ని పెంపొందించడంపై చర్చలు జరిపారు.

సైనిక లాంఛనాలతో గొట్టపు శంకరరావుకు నివాళి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విజయనగరం జిల్లా బందంగిలోని అతని స్వగ్రామంలో ఆర్మర్డ్ వర్క్‌షాప్‌నకు చెందిన బాటిల్ క్యాజువాలిటీ సిఎఫ్ఎన్ గొట్టపు శంకరరావు అంత్యక్రియల సందర్భంగా భారత సైన్యం, నేవీ, జిల్లా పరిపాలన, పోలీసు శాఖ ఎన్‌సిసి అధికారులు ఆయనకు నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులు, పెద్ద సంఖ్యలో స్థానికులు హాజరైన ఈ వేడుక పూర్తి సైనిక గౌరవాలతో నిర్వహించారు. అంతకుముందు, విశాఖపట్నంలోని ఐఎన్‌హెచ్ఎస్ కళ్యాణిలో పుష్పగుచ్ఛం ఉంచి, ఈస్టర్న్ నేవల్ కమాండ్, స్టేషన్ హెడ్‌క్వార్టర్స్ (ఆర్మీ), జిల్లా అధికారులు, నగర పోలీసుల ప్రతినిధులు బ్రేవ్ హార్ట్‌కు నివాళులర్పించారు.